

'రెవెన్యూ సమస్యలు తగ్గాలి'

పార్వతీపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): క్షేత్ర స్థాయిలో రెవెన్యూ సమస్యలు తగ్గాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. రెవెన్యూ సదస్సుల అనంతరం సమస్యల పరిష్కారంపై సమగ్ర నివేదిక ఇవ్వాలన్నారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో సమీక్షించారు. పీఎం ఆవాస్ యోజన 2.0లో భాగంగా అర్హులను గుర్తించాలని, ఫిబ్రవరి నాటికి ఐదు వేల గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. ఎస్సీ ఆడిట్‌లో భాగంగా ఈ నెల 7వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరించనున్నట్లు చెప్పారు.



దట్టంగా పొగ మంచు..

సీతంపేట రూరల్, జనవరి3 (ఆంధ్రజ్యోతి): సీతంపేట మన్యంలో మంచు దట్టంగా కురుస్తోంది. ఉదయం 9గంటల వరకు ఇదే పరిస్థితి. దీంతో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు సైతం కనిపించడం లేదు. వాహనదారులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించాల్సి వస్తోంది. శుక్రవారం కూడా పాలకొండ-హడ్డుబంగి ప్రధాన రహదారిపై వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. ఎదురుగా వస్తున్నవి కనిపించకపోవడంతో బస్సులు, భారీ వాహనాలను కొంత సమయం పాటు నిలిపివేశారు. ఆటోలు, ద్విచక్ర వాహనదారులు పట్టపగలు హెడ్‌లైట్‌లు వేసుకొని ప్రయాణాలు సాగించారు. మంచుతో పాటు చలి తీవ్రత కూడా పెరగడంతో వాకర్స్, వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మొత్తంగా మన్యం వాసులు ఉదయం తొమ్మిది గంటల వరకు రోడ్డు పైకి వచ్చేందుకు సాహసించడం లేదు.



ముగ్గుల పోటీకి సిద్ధమైన ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం

నేడే 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్'

ముత్యాల ముగ్గుల పోటీలు

- పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహణ
- ఏర్పాట్లు పూర్తి
- విజేతలకు భారీగా నగదు పురస్కారాలు

పార్వతీపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సమీపిస్తోంది. పండుగ నేపథ్యంలో ఏటా మాదిరి ఈ ఏడాదీ 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ఆధ్వర్యంలో ముత్యాల ముగ్గుల పోటీల నిర్వహణకు రంగం సన్నద్ధమైంది. 'ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలకు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా(ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్)" సహకారం అందించనున్నాయి. మహిళలు ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొని.. అందమైన ముగ్గులు వేసి.. ఆకర్షణీయమైన బహుమతులను గెలుచుకోవాలని 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' పిలుపునిస్తోంది.

పార్వతీపురం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో శనివారం మత్యాల ముగ్గుల పోటీ నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే ఈ పోటీలకు పార్వతీపురంతో పాటు సాలూరు, కురుపాం, పాలకొండ నియోజకవర్గాలతో పాటు పలు మండలాల నుంచి మహిళలు తరలిరానున్నారు. ఆకర్షణీయమైన మూడు ముగ్గులను న్యాయనిర్ణేతలు ఎంపిక చేసి విజేతలకు బహుమతులతో పాటు నగదు పురస్కారాన్ని అందజేస్తారు. ప్రథమ విజేతకు రూ.6వేలు, ద్వితీయ విజేతకు రూ.4వేలు, తృతీయ విజేతకు రూ.3 వేలతో పాటు మెమొంటోలు ఇస్తారు. పోటీల్లో పాల్గొన్న మహిళలకు కన్సొలేషన్ బహుమతులు కూడా అందజేస్తారు. ఈ ముగ్గుల పోటీలకు స్థానిక స్పాన్సర్‌గా శ్రీవెంకటేశ్వర జ్యూయల్ ప్యాలెస్ వ్యవహరిస్తోంది. ముఖ్య అతిథులుగా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎస్పీ మాధవరెడ్డి, ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర హాజరు కానున్నారు. జిల్లా స్థాయిలో విజేతను ఈ నెల 11న విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తారు. రాష్ట్రస్థాయిలో జరిగే పోటీల్లో ఏకంగా రూ.1.50 లక్షల విలువైన బహుమతులను గెలుచుకోవచ్చు.

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

- నేటి నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రారంభం
- సర్కారు నిర్ణయంపై జిల్లావాసుల హర్షం

పార్వతీపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నేటి నుంచి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం కానుంది. కూటమి ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వం సిద్ధం చేశారు. ఇంటర్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలోని 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 5,905 మంది విద్యనభ్యసిస్తున్నారు. ఇందులో 2,016 మంది వసతిగృహాల్లో ఉంటూ కళాశాలల్లో చదువుతున్నారు. మరో 3,507 మంది ఇళ్ల నుంచి కళాశాలలకు వస్తున్నారు. కాగా గత వైసీపీ ప్రభుత్వం జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి మంగళం పాడేసింది. పార్వతీపురం జిల్లా కేంద్రంలో అన్న క్యాంటీన్‌ను సైతం మూసివేయించింది. దీంతో నిరుపేద విద్యార్థులు ఆకలితో తీవ్ర ఇబ్బందులు పడేవారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాలకు చెందిన వారు మధ్యలోనే చదువులను ఆపేశారు. ఈ సమస్యలను పరిగణనలోకి తీసుకున్న కూటమి ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు రోజూ మధ్యాహ్న భోజనం పెట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. శనివారం నుంచి అన్ని జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలు కానుండగా.. సీఎం చంద్రబాబు నిర్ణయంపై విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సాలూరులో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, కురుపాంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, పార్వతీపురంలో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, పాలకొండలో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో ఈ పథకాన్ని ప్రారంభించనున్నారని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి డి.మంజులవీణ తెలిపారు.





గది ఉంది.. ఎక్స్‌రే లేదు!

- ఓపీలు రాయడానికే పరిమితమైన రేడియోగ్రాఫర్
- ఇదీ చినమేరంగి సీహెచ్‌సీలో దుస్థితి



సీహెచ్‌సీలో ఎక్స్‌రే గది ఇలా..

జియ్యమ్మవలస, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): చినమేరంగి సామాజిక ఆరోగ్య కేంద్రంలో విచిత్ర పరిస్థితి నెలకొంది. ఇక్కడ ఎక్స్‌రే ప్లాంటు లేకుండానే రేడియోగ్రాఫర్‌ను నియమించి అధికారులు చేతులు దులుపుకున్నారు. ఈ విషయాన్ని వైద్యాధికారులు వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉప ముఖ్యమంత్రిగా ఉన్న పుష్పశ్రీవాణి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేక పోయింది. 2012లో సీహెచ్‌సీని ఏర్పాటు చేశారు. అప్పట్లోనే ఎక్స్‌రే ప్లాంటు కోసం సీహెచ్‌సీలో ఒక గదిని కేటాయించారు. అయితే వివిధ కారణాలతో ఎక్స్‌రే ప్లాంటు, పరికరాలను మంజూరు చేయ లేదు. 2023 మార్చిలో ఎస్.రవికుమార్ అనే వ్యక్తిని రేడియోగ్రాఫర్‌గా నియమించారు. కానీ ఎక్స్‌రే ప్లాంటు మంజూరు చేయకపోవడం వల్ల ఆయన ఇన్, ఔట్ పేషెంట్లకు ఓపీ, ఐపీలు రాయడం వరకే పరిమితమయ్యారు. వాస్తవానికి ఈ సీహెచ్‌సీకి రోగుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. నెలకు కనీసం ఐదు నుంచి పది యాక్సిడెంట్ కేసులు వస్తుంటాయి. క్షతగాత్రులకు ఎక్స్‌రే తీసుకోవాలని వైద్యులు సూచిస్తుండగా.. సీహెచ్‌సీలో మాత్రం ఆ సదుపాయం లేదు. అత్యవసర వేళల్లో రోగులు కురుపాం సీహెచ్‌సీ , పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రికి పరుగులు పెట్టాల్సి వస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని 115 గ్రామాల ప్రజలు కోరుతున్నారు. దీనిపై డీసీహెచ్ఎస్ వాగ్దేవిని వివరణ కోరగా.. చినమేరంగి సీహెచ్‌సీలో ఓపీ పెరగడంతో ఎక్స్‌రే ప్లాంట్ విషయంపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని తెలిపారు.

రోగులకు మెరుగైన సేవలు

- డీఎంహెచ్‌వో భాస్కరరావు

పార్వతీపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వాసుపత్రుల ద్వారా రోగులకు మెరుగైన సేవలు అందిస్తామని డీఎంహెచ్‌వో భాస్కరరావు తెలిపారు. శుక్రవారం ఆయన విధుల్లో చేరారు. ముందుగా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎమ్మెల్యే బోనెల విజయచంద్రను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో విజయపార్వతి నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. గతంలో ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్‌వోగా విధులు నిర్వహించిన అనుభవం ఉందన్నారు. ఈ ప్రాంతంలో మలేరియా, డెంగ్యూ తదితర వ్యాధులతో పాటు రక్తహీనత నివారణకు చర్యలు తీసుకుంటామమని తెలిపారు. ఎక్కడ ఎటువంటి సమస్య ఉన్నా నేరుగా తనకు తెలియజేయాలని సూచిచారు.

పీహెచ్‌సీల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

గరుగుబిల్లి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని డీఎంహెచ్‌వో భాస్కరరావు ఆదేశించారు. గరుగుబిల్లి పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీహెచ్‌సీల్లో వైద్యుల కొరత లేకుండా చూస్తామన్నారు. విధుల నిర్వహణపై సిబ్బంది అలసత్వం వహిస్తే సహించేది లేదని తెలిపారు.



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు

తప్పనిసరిగా సమయపాలన పాటించాలన్నారు. రోగులకు అవసరమైన మందులు, పాము, కుక్క కాట్లుకు సంబంధించిన వ్యాక్సిన్ల నిల్వలను అందుబాటులో ఉంచాలని సూచించారు. వైద్యశాఖ పరిధిలో నిర్వహిస్తున్న సర్వేలను సక్రమంగా నిర్వంచాలన్నారు. హైరిస్క్ గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనపర్చాలన్నారు. అనంతరం ఆరోగ్య కేంద్రంలో డేటా ఎంట్రీ వివరాలతో పాటు సిబ్బంది హాజరు, రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట జిల్లా కార్యక్రమ అధికారి వినోద్‌కుమార్, వైద్యులు ఉన్నారు.

పార్వతీపురంలో ఇన్నోవేషన్ హబ్

- ఏర్పాటుకు చర్యలు: కలెక్టర్
- ఆకట్టుకున్న జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన



6లో

చదువుల తల్లి సేవలో..

- ఎందరినో తీర్చిదిద్దిన బొబ్బిలి గురుకుల పాఠశాల
- పూర్వ విద్యార్థుల చొరవతో సౌకర్యాలు

6లో

విదర్భ విజయ పరంపర

- వరుసగా ఐదో విజయం
- ఉత్తరప్రదేశ్ జట్టుపై ఎనిమిది వికెట్ల తేడాతో గెలుపు

6లో

తాటిపూడిలో బోటు షికారు ప్రారంభం



6లో

చదువుల తల్లి సేవలో..


విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస తరగతులు

చదువు పూర్తవడంతోనే పాఠశాలతో అనుబంధం తీరిపోయిందని అనుకుంటారు చాలా మంది. దీనికి భిన్నంగా తమ చదువులు పూర్తయినా... పాఠశాల అభివృద్ధికి... విద్యార్థుల ఉన్నతికి తమ వంతు ప్రయత్నం చేస్తున్నారా పూర్వ విద్యార్థులు. వివిధ కార్యక్రమాలు చేపడుతూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. వారే బొబ్బిలి గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థులు.

- ఎందరినో తీర్చిదిద్దిన గురుకుల పాఠశాల
- పూర్వ విద్యార్థుల చొరవతో సౌకర్యాలు
- కర్ణాటకలోని ఉడిపి కలెక్టర్ ఇక్కడి విద్యార్థే
- 60 మంది వైద్యులు... 200 మందికి పైగా ఇంజనీర్లు
- 15 మంది ప్రొఫెసర్లు... వెయ్యి మంది ఉపాధ్యాయులు


గురుకులంలో భోజనం చేస్తున్న ఐఏఎస్ అధికారులు వీరే (ఫైల్)


ఉపాధ్యాయుడికి వెండి కిరీటం, బంగారు కంకణం సమర్పిస్తున్న పూర్వ విద్యార్థులు (ఫైల్)

బొబ్బిలి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి)

విద్యాబుద్ధులు నేర్పి.. సమాజంలో తమకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు రావడానికి కారణమైన పాఠశాల రుణం తీర్చుకోవడానికి పూర్వ విద్యార్థులు కృషి చేస్తున్నారు. అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇదీ బొబ్బిలి ప్రభుత్వ గురు కుల పాఠశాల పూర్వ విద్యార్థుల విశిష్టత. 1983లో అప్పటి సీఎం ఎన్టీ రామారావు మొదటిగా ఏర్పాటు చేసిన గురుకు లాల్లో ఇది ఒకటి. ఇక్కడ ఏటా శతశాతం ఉత్తీర్ణత సాధించ డం ఓ విశేషమైతే... అందులో ప్రథమ, ద్వితీయ శ్రేణుల వారే ఎక్కువగా ఉండడం మరో ఘనతగా చెప్పుకో వచ్చు. ఈ పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్చుకున్న వారంతా దేశ విదేశాల్లో వివిధ హోదాలలో స్థిరపడ్డారు. వీరిలో ముగ్గు రు ఐఏఎస్‌లు, ఒకరు గ్రూపు-1 అధికారిగా ఉన్నారు. 200 మంది ఇంజనీర్లు, 60మంది వైద్యులు, 15 మంది ప్రొఫెసర్లు, వెయ్యి మంది వరకు ఉపాధ్యాయులుగా స్థిరపడ్డారు. ఇంకా ఎయిర్‌ఫోర్స్, ఆర్మీ వంటి రక్షణ దళాల్లోనూ అనేక మంది సేవలందిస్తున్నారు.

సంఘంగా ఏర్పడి...

చదువుల తల్లి రుణం తీర్చుకోవాలన్న తపనతో పూర్వ విద్యార్థులంతా ఓ సంఘంగా ఏర్పడి పాఠశాలకు కావాల్సిన మౌలిక సదుపాయాలను, ఇతర హంగులను సమకూర్చుతున్నారు. విద్యార్థుల కోసం.. పాఠశాల అభివృద్ధికి సుమారు రూ.50 లక్షలు వెచ్చించడం గమనార్హం. రూ.23 లక్షలు వెచ్చించి డార్మెటరీని.. రూ.3 లక్షలతో కళావేదికను నిర్మించారు. ఫ్యాన్లు, తాగునీటి ప్లాంటు, బోరుబావి, సోలార్ బల్బులు, పుస్తకాలు, బోధనా సామగ్రి వంటివి సమకూర్చారు. రూ. 5 లక్షలతో సోలార్ ప్యానెల్స్, టీవీ, రూ. 5 లక్షలతో ఆపిల్ ల్యాప్‌టాప్ అందించారు. ఏటా రెండుసార్లు ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించి మందులను పంపిణీ చేస్తున్నారు. డార్మెటరీ నిర్మాణంలో పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షుడు జోగినాయుడు, గణేశ్, లక్ష్మీ నారాయణలు కీలక పాత్ర పోషించారు. పాఠశాల ప్రాంగణంలో ఫ్లడ్‌లైట్స్, నెహ్రూ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ చదువుకున్న మిత్తిరెడ్డి కూర్మారావు కర్ణాటక రాష్ట్రంలోని ఉడిపి జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. జి.తిరుపతిరావు ఐఏఎస్ అధికారిగా పని చేస్తున్నారు. వీరు వీలు చిక్కినప్పుడు పాఠశాలను సందర్శించి విద్యార్థులకు ప్రేరణ కలిగించే విధంగా వివిధ అంశాలను వివరిస్తున్నారు. ఎక్కువ మంది విద్యార్థులను ప్రభావితం చేసిన నాటి గురువు ఎంవీ రామ్మోహనరావు దంపతులను రూ.3 లక్షలు వెచ్చించి బంగారు కంకణం, వెండి కిరీటంతో పూర్వ విద్యార్థులు సత్కరించారు.



విద్యార్థుల డార్మెటరీ

రుణం తీర్చుకోవడం ధర్మం..

చదువుల తల్లి రుణం తీర్చుకోవడం కనీస ధర్మం. ఈ పాఠశాల మట్టి చాలా గొప్పది. ఇక్కడ విద్యాబుద్ధులు నేర్చుకున్న వారంతా ప్రతిభావంతులుగానే రాణించారు. అందుకే పూర్వ విద్యార్థులమంతా తరచూ సమావేశమై కార్యాచరణ రూపొందించుకుంటాం. పాఠశాల అవసరాలను తీర్చేందుకు మా వంతు కృషి చేస్తున్నాం. ఇంతవరకు సుమారు రూ.50 లక్షలతో వివిధ హంగులు సమకూర్చాం.

-వై.జోగినాయుడు, పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షుడు

గురుకులానికి ఓ వరం..

బొబ్బిలి ప్రభుత్వ గురుకుల పాఠశాలకు రాష్ట్ర స్థాయిలో అకడమిక్ పరంగా మంచి గుర్తింపు ఉంది. పూర్వ విద్యార్థులంతా తరచూ పాఠశాలకు వచ్చి ఇక్కడ అవసరమైన వాటిని సమకూర్చేందుకు ఎంతో కృషి చేస్తున్నారు. ఇది నిజంగా ఒక వరం. ఈ పాఠశాలను మరింత ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు మా వంతు కృషి చేస్తున్నాం. కేంద్ర ప్రభుత్వ పథకం కింద పాఠశాల ఎంపిక కావడంతో విద్యార్థుల భవిష్యత్‌కు మరింత భరోసా కల్పించినట్లయింది.

-రఘునాథ్, ప్రిన్సిపాల్

తాటిపూడిలో లాహిరి..లాహిరి

- బోటు షికారు ప్రారంభం


బోటు షికారును ప్రారంభిస్తున్న మంత్రి కొండపల్లి, ఎమ్మెల్యే అదితి

గంట్యాడ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లగా తాటిపూడి రిజర్వాయర్‌లో నిలిచిన బోటు షికారు శుక్రవారం పునః ప్రారంభమైంది. దీంతో రిజర్వాయర్‌కు కొత్త కళ వచ్చింది. జిల్లాలో ఒక్క తాటిపూడి పర్యాటక కేంద్రంలోనే బోటు షికారు సదుపాయం ఉంది. ఇక్కడికి జిల్లాతో పాటు ఇత ర ప్రాంతాల వారు కూడా అధిక సంఖ్యలో వస్తుంటారు. ఇక నుంచి ఇక్కడ సందర్శకుల తాకిడి పెరిగే అవకాశం ఉంది. గత వైసీపీ హయాంలో తాటిపూడి పర్యాటక కేంద్రాన్ని పూర్తిగా గాలికి వదిలేశారు. దీంతో ఈ ప్రాంతం బోసిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పర్యాటక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఈ నేపథ్యంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ బోటు షికారును పునఃప్రారంభించేందుకు జలవనరులశాఖ అధికారులతో చర్చించారు. ఈ మేరకు రిజర్వాయర్‌లో పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యంతో దీనిని ప్రారంభించారు. వీటిలో 2 సీట్లు గల బోట్లు రెండు, నాలుగు సీట్ల పెడల్ బోటు, ఐదు సీట్లతో ఒకటి, 10 సీట్లు గల బోటు ఒకటి, 16 సీట్ల వాటర్ ట్యాక్సీ ఒకటి ఏర్పాటు చేశారు.

పర్యాటక అభివృద్ధిలో తొలి అడుగు: మంత్రి

జిల్లాలో పర్యాటక అభివృద్ధి దిశగా తొలి అడుగు పడిందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. తాటిపూడి రిజర్వాయర్‌లో అడ్వెంచర్ వాటర్ స్పోర్ట్స్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, టీడీపీ నాయకులు కొండపల్లి కొండలరావు, ఐవీపీ రాజు కలిసి బోటు షికారు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ రిజర్వాయర్‌లో ముందుగా వాటర్ ట్యాక్సీలు, స్పీడ్ బోట్లు ఏర్పాటు చేశారని, రెండో దశలో జల క్రీడలను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. మూడో దశలో హౌస్ బోట్లు, ఫ్లోటింగ్, కాటేజీలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. సుమారు రూ.5 కోట్లతో నిర్వాహక సంస్థ ఇక్కడ బోటింగ్ ఏర్పాటు చేస్తోందన్నారు. ఈ ప్రాంతానికి చెందిన యువతకు తగిన ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్టు చెప్పారు. అమెరికా తరహాలో పూర్తిస్థాయి భద్రతా ప్రమాణాలు పాటించి.. బోటింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రానున్న రోజుల్లో పర్యాటకుల కోసం రాత్రి వేళల్లో లైటింగ్, మరుగుదొడ్లు వంటి వసతులను కల్పించనున్నట్లు మంత్రి తెలిపారు. గిరిజనుల కోసం అటవీ శాఖ ఆధ్వర్యంలో బోటు సౌకర్యాన్ని కూడా త్వరలో పునరుద్ధరించేందుకు చర్యలు చేపడతామని మంత్రి వెల్లడించారు. ఈ రిజర్వాయర్‌కు గొర్రిపాటి బుచ్చి అప్పారావు పేరు పెట్టడం ఆనందదాయకమన్నారు. అడ్వెంచర్ వాటర్ స్పోర్ట్స్ లో భాగంగా పర్యాటకుల భద్రతకు అన్ని చర్యలు చేపట్టామని నిర్వాహక సంస్థ వాటర్ స్పోర్ట్స్ సింపుల్ కార్యనిర్వహణ అధికారి పాపారావు తెలిపారు. రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ బోటు షికారు ఉంటుందన్నారు. బోటును బట్టి రూ.100, రూ.150, రూ.200గా టికెట్ ధరలను నిర్ణయించమన్నారు. కాపు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పాలవలస యశస్విని, కొప్పల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ మిడతాన రవికుమార్, జనసేన నాయకులు ఎం.సురేష్, ఆదాడ మోహన్‌రావు, టీడీపీ నాయకులు కొండపల్లి కొండలరావు, ప్రాజెక్టు కమిటీ చైర్మన్ జగన్నాథం, ఇరిగేషన్ ఈఈ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

విదర్భ విజయపరంపర

- వరుసగా ఐదో విజయం
- ఉత్తరప్రదేశ్ జట్టుపై 8 వికెట్ల తేడాతో గెలుపు
- వరుస సెంచరీలతో చెలరేగుతున్న కరుణ్ నాయర్
- మ్యాచ్‌ను తిలకించిన కేంద్ర మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజు
- 71 పరుగులకే కుప్పకూలిన మిజోరం
- 10 వికెట్ల తేడాతో గెలుపొందిన తమిళనాడు



విజయనగరం టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా వేదికగా జరుగుతున్న విజయ్ హజారే ట్రోఫీలో విదర్భ జట్టు విజయ పరంపర కొనసాగుతోంది. వరుసగా ఐదు మ్యాచ్‌లలో గెలుపొంది... ఆధిపత్యాన్ని చాటుకుంటోంది. విదర్భ జట్టు కెప్టెన్, టీమిండియా మాజీ ఆటగాడు కరుణ్ నాయర్ వరుసగా భారీ శతకాలతో చెలరేగి జట్టుకు ఒంటి చేత్తో విజయాలు అందిస్తున్నాడు. ఐదు మ్యాచ్‌లలో నాలుగు భారీ శతకాలు సాధించి... టోర్నీ టాప్ స్కోరర్‌గా (542 పరుగులు) నిలిచాడు. ఇందులో నాలుగుసార్లు అజేయంగా నిలవగా... ఆఖరి మ్యాచ్‌లో లక్ష్యానికి దగ్గరలో అవుటయ్యాడు.

• రాథోడ్, కరుణ్ నాయర్ సెంచరీలు..

నగరంలోని విజ్జీ క్రికెట్ మైదానంలో విదర్భ, ఉత్తరప్రదేశ్ జట్ల మధ్య శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో విదర్భ జట్టు బలమైన ఉత్తరప్రదేశ్ జట్టుపై 8 వికెట్ల తేడాతో గెలుపొందింది. ముందుగా టాస్ గెలిచిన విదర్భ జట్టు కెప్టెన్ కరుణ్ నాయర్ ఫీల్డింగ్‌కు మొగ్గు చూపాడు. దీంతో బ్యాటింగ్ ప్రారంభించిన ఉత్తరప్రదేశ్ జట్టు టాపార్డర్ బ్యాటర్ సమీర్ రిజ్వీ 105 (82 బంతుల్లో 5 ఫోర్లు, 7 సిక్స్‌లు) సెంచరీతో నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 307 పరుగులు సాధించింది. ఒక దశలో భారీ స్కోర్ ఖాయమనుకున్న ఉత్తరప్రదేశ్ జట్టు సెంచరీ వీరుడు రిజ్వీ 42వ ఓవర్లో 246 పరుగుల వద్ద ఐదో వికెట్ రూపంలో వెనుదిరగడం... 4 ఓవర్ల వ్యవధిలో మరో 3 వికెట్లు కోల్పోవడంతో 307 పరుగులకు పరిమితమైంది. ఆఖరి ఓవర్‌లో శివం మావి రెండు బౌండరీలు, ఒక సిక్స్‌తో 18 పరుగులు రాబట్టి... జట్టు స్కోరును 300 దాటించాడు. ఆ జట్టు బ్యాటర్లలో అభిషేక్ గోస్వామి (32), మాధవ్ కౌశిక్ (41), ప్రియం గార్గ్ (34) రాణించారు. టీమిండియా టి-20 ఆటగాడు, ఉత్తరప్రదేశ్ కెప్టెన్ రింకూసింగ్ (6) స్వల్ప స్కోర్‌కే వెనుదిరిగాడు. విదర్భ జట్టు బౌలర్లలో భూటే 4, నల్కండే 2 వికెట్లతో రాణించారు. అనంతరం 308 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన విదర్భ జట్టు ఓపెనింగ్ బ్యాటర్ వైవీ రాథోడ్ 138 (140 బంతుల్లో 15 ఫోర్లు, ఒక సిక్స్‌తో నాటౌట్), వన్‌డౌన్ బ్యాటర్, జట్టు కెప్టెన్ కరుణ్ నాయర్ 112 (101 బంతుల్లో 11 ఫోర్లు, 2సిక్స్‌లు) సెంచరీ సాయంతో 47.2 ఓవర్లలోనే విజయాన్ని అందుకుంది. వైవీ రాథోడ్, కరుణ్‌నాయర్ జోడీ రెండో వికెట్‌కు 228 పరుగుల భాగస్వామ్యంతో జట్టు విజయాన్ని సునాయాసం చేశారు. అజేయ సెంచరీతో జట్టు విజయానికి కృషి చేసిన విదర్భ జట్టు ఓపెనింగ్ బ్యాటర్ రాథోడ్‌కు ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు లభించింది.

• తిలకించిన కేంద్ర మాజీ మంత్రి..

విదర్భ, ఉత్తరప్రదేశ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌ను కేంద్ర మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు అశోక్ గజపతి రాజు ఆసక్తిగా తిలకించారు. సుమారు రెండు గంటలకు పైగా ఆయన మైదానంలో ఉన్నారు. అశోక్‌గజపతిరాజుకు మ్యాచ్ విషయాలను జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి పి.సీతారామరాజు వివరించారు.

• 71 పరుగులకే కుప్పకూలిన మిజోరం..

జిల్లాలోని డెంకాడ మండలం చింతలవలసలోని డాక్టర్ పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ మైదానంలో తమిళనాడు, మిజోరం జట్ల మధ్య శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో తమిళనాడు బౌలర్ల ధాటికి మిజోరం 21.2 ఓవర్లలోనే 71 పరుగులకు కుప్పకూలింది. టాస్ గెలిచిన తమిళనాడు జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ ప్రారంభించిన మిజోరం జట్టు... తమిళనాడు జట్టు బౌలర్లు వరుణ్ (5 వికెట్లు), టీమిండియా మాజీ ఆటగాడు విజయ్ శంకర్ (2 వికెట్లు), వారియర్ (2వికెట్లు) ధాటికి పేకమేడలా కూలింది. మిజోరం జట్టు బ్యాటర్లలో అండర్సన్ (12), అగ్ని చోప్రా (23), మోహిత్ జంగ్రా (17)లు మాత్రమే రెండంకెల స్కోర్లు సాధించారు. అనంతరం స్వల్ప లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన తమిళనాడు జట్టు వికెట్ నష్టపోకుండా కేవలం 10 ఓవర్లలోనే 75 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. జట్టు ఓపెనింగ్ బ్యాటర్లు తుషార్ రహెజా (27 నాటౌట్), ఎన్.జగదీశన్ (28 బంతుల్లో 46 పరుగులు నాటౌట్) అజేయంగా నిలిచి జట్టుకు విజయాన్ని అందించారు. 5 వికెట్లు సాధించిన తమిళనాడు బౌలర్ వరుణ్‌కు ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు లభించింది.


మ్యాచ్‌ను చూస్తున్న అశోక్ గజపతిరాజు తదితరులు


క్యాచ్ పట్టిన ఆనందంలో..

పార్వతీపురంలో ఇన్నోవేషన్ హబ్

- ఏర్పాటుకు చర్యలు: కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్
- ఆకట్టుకున్న జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన


వైజ్ఞానిక ప్రదర్శనలను తిలకిస్తున్న కలెక్టర్

బెలగాం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురంలో త్వరలో ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. నీతి అయోగ్ ప్రకటించిన ర్యాంకింగ్‌లో ఆశావాహ (ఆస్పిరేషనల్) జిల్లాగా పార్వతీపురం మన్యం నిలిచిందన్నారు. ఈ మేరకు రూ.3 కోట్లు విడుదలయ్యాయని, ఆ మొత్తంతో విద్యార్థులకు ఉపయోగపడేలా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. శుక్రవారం విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక డీవీఎం పాఠశాలలో జిల్లా స్థాయి వైజ్ఞానిక శాస్త్ర ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన వివిధ సైన్స్ ప్రాజెక్టులను కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, డీఈవో ఎన్.తిరుపతినాయుడు తదితరులు తిలకించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రశ్నించే తత్వంతోనే సైన్స్ మొదలవుతుందని గుర్తు చేశారు. విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. విద్యార్థులను ఇంజినీర్లుగా, శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు ఎమ్మెల్యే సూచించారు. జిల్లాలో 15 మండలాల్లో ఎంపిక చేసిన 45 ప్రాజెక్టులతో ప్రదర్శన ఏర్పాటు చేశామని డీఈవో తెలిపారు. అనంతరం వైజ్ఞానిక ప్రదర్శన, క్విజ్ పోటీల్లో విజేతలైన వారికి కలెక్టర్ జ్ఞాపిక, సర్టిఫికెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష అదనపు పథక సమన్వయాధికారి తేజేశ్వరరావు, అధికారులు రాజ్ కుమార్, శ్రీనివాసరావు, దామోదరావు, హెచ్ఎం గోవిందరావు తదిరతులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

వ్యక్తిగత విభాగంలో మార్కొండపుట్టికి చెందిన 9వ తరగతి విద్యార్థి టి.చరణ్ సాయి, కంబరవలసకు చెందిన 9వ తరగతి విద్యార్థి ఎ.రిషి గెలుపొందారు. గ్రూప్ విభాగంలో వీరఘట్టం మండలం తలవరం ఉన్నత పాఠశాలకు చెందిన డి.నితిన్ కుమార్, పి.గోవిందరావు, సీతానగరం బీఆర్ అంబేడ్కర్ పాఠశాల గురుకులం చెందిన విద్యార్థులు పి.గౌతం, జి.పార్థ సారథి బహుమతులు పొందారు. టీచర్ వ్యక్తిగత విభాగంలో పాలకొండ మండలం గోపాలపురానికి చెందిన స్వర్ణలత, సాలూరు మండలం మామిడిపల్లికి చెందిన డి.ప్రసన్న కుమార్ విజేతలుగా నిలిచారు.

సదస్సులకు స్పందన బాగుంది

- చీపురుపల్లి ఆర్డీఓ సత్యవాణి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



చీపురుపల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల నిర్వహణ సక్రమంగా సాగుతోందని.. ప్రజల నుంచి స్పందన బాగుందని చీపురుపల్లి ఆర్డీఓ జీవీ సత్యవాణి తెలిపారు. సదస్సుల నిర్వహణ, తదితర అంశాలను ఆమె 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు. విశేషాలివీ...

● **ప్రశ్న:** రెవెన్యూ సదస్సులు ఎలా సాగుతున్నాయి?

● **జవాబు:** బాగానే జరుగుతున్నాయి. ముందు రోజే సంబంధిత గ్రామాల్లో దండోరా వేయడం వల్ల ప్రజలు పెద్ద ఎత్తున సదస్సులకు హాజరై తమ సమస్యలు చెప్పుకుంటున్నారు.

● **ప్ర:** ఇప్పటి వరకూ ఎన్ని గ్రామాలు పూర్తయ్యాయి?

● **జ:** చీపురుపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలో 321 గ్రామాలు ఉన్నాయి. సోమవారం వరకూ 234 గ్రామాల్లో సదస్సులు పూర్తయ్యాయి. వీటిలో వివిధ సమస్యలపై ప్రజల నుంచి 1,243 దరఖాస్తులు స్వీకరించాం. వాటిలో 353 దరఖాస్తులకు తహసీల్దారుల స్థాయిలోనే పరిష్కారం చూపించాం.

● **ప్ర:** మిగిలిన సమస్యలు ఎప్పటిలోగా పరిష్కారమవుతాయి?

● **జ:** నిర్ణీత గడువులోగా అన్ని సమస్యలు పరిష్కరిస్తాం. పరిష్కారం కాని పక్షంలో సంబంధిత దరఖాస్తుదారులకు తెలియజేస్తాం. పరిష్కారం కాకపోవడానికి తగిన కారణాలను కూడా వారికి వివరిస్తాం.

● **ప్ర:** ఎటువంటి సమస్యలు మీ దృష్టికి వస్తున్నాయి?

● **జ:** అన్ని రకాల సమస్యలు ఉన్నాయి. ముఖ్యంగా మ్యుటేషన్లు, సరిహద్దు సమస్యలు, సర్వే నంబర్లలో తప్పులు లేదా తేడాలు, విస్తీర్ణంలో తేడాలు వంటి సమస్యలు మా దృష్టికి వస్తున్నాయి. అటువంటి సమస్యల పరిష్కారానికి మా పరిధిలో ఎంత చేయాలో అంత చేస్తున్నాం. ప్రజలకు జవాబుదారీతనంగా ప్రభుత్వం లేదా అధికారులు ఉండాలన్నదే ఈ సదస్సుల ఉద్దేశం. ప్రతి సమస్యకీ పరిష్కారం లభించాలి, లేదా సరైన సమాధానం చెప్పి పరిష్కారం చూపించాలి. అదే ప్రభుత్వ లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం.

పంటల పరిశీలన

శృంగవరపుకోట రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని సంతగైరమ్మపేటలో దెబ్బతిన్న పంటలను వ్యవసాయ శాఖ జేడీ రామారావు శుక్రవారం పరిశీలించారు. తడిసిన వరి కుప్పలు, అపరాల పంటలను చూశారు. పంటల బీమా నమోదు చేసుకోవాలని సూచించారు. రైతులు నూర్పు చేసిన ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా మిల్లులకు పంపించాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ విజయ, ఏవో రవీంద్ర, వీఏఏ రవి తదితరులు ఉన్నారు. అలాగే జామి మండలంలోని భీమసింగిలో దెబ్బతిన్న మొక్కజొన్న పంటను జేడీ రామారావు, ఏవో కిరణ్‌కుమార్ ఎరిశీలించారు.

ఆక్రమణలు తొలగించండి

శృంగవరపుకోట రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ముషిడిపల్లి పరిధిలోని పెదబంద, చినబందల చెరువుల్లో ఆక్రమణలు తొలగించాలని ఆయకట్టుదారులు కోరారు. ఈమేరకు శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. విజయనగరానికి చెందిన కొంత మంది ఇక్కడ భూములు కొన్నారని, వారు ఈ చెరువు గర్భాల్లో దర్జాగా తోటల సాగు చేస్తున్నారన్నారు. వారిని నిలదీస్తే ఎదురుతిరుగుతున్నారన్నారు. స్థానిక పంచాయతీ పరిధిలో ప్రభుత్వ భూములు ఆక్రమణలో ఉన్నాయని, వాటిని అధికారులు పరిశీలించాలన్నారు. ఈవిషయంపై తహశీల్దార్ అరుణకుమారి వివరణ కోరగా పెదబంద ఆక్రమణలపై రైతుల ఫిర్యాదుల మేరకు సిబ్బంది పంపించామని, ఇరిగేషన్ అధికారుల సమక్షంలో హద్దులు నిర్ధారించామన్నారు. ఆక్రమణల తొలగింపునకు ఆదేశాలు జారీ చేశామన్నారు.

రేపటి నుంచి క్రీడా పోటీలు

నెల్లిమర్ల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలికల గురుకుల పాఠశాలలో ఈ నెల 5, 6 తేదీల్లో జోన్ 1 పరిధిలోని విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం ఉమ్మడి జిల్లాల గురుకుల బాలికలకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్టుఆ పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.బి.బి.రావు ఒక ప్రకటనలో తెలిపారు. మూడు జిల్లాల పరిధిలోని 14 పాఠశాలలకు చెందిన సుమారు 350 విద్యార్థినులు హాజరు కానున్నారని తెలిపారు. పోటీల్లో విజేతలు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

మన్మోహన్ సింగ్‌కు నివాళి

విజయనగరం రింగురోడ్డు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం కాంగ్రెస్ పార్టీకే కాకుండా దేశానికే తీరని లోటు అనిడీసీసీ అధ్యక్షుడు ఎం.విద్యాసాగర్ అన్నారు. నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో డీవైసీ అధ్యక్షుడు పి.శ్రీనివాసరావు, ఎస్.కోట నియోజకవర్గ కో-ఆర్డినేటర్ గేదెల తిరుపతిరావు, సతీష్, రామచంద్రరాజు, ఓబీసీ చైర్మన్ సురేష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బస్సు ప్రమాదంపై ఆరా

విజయనగరం రింగురోడ్డు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మెంటాడ మండలం గుర్మమ్మవలస సమీపంలో శుక్రవారం ఆర్టీసీ బస్సు బోల్తా పడిన ఘటనపై ఏపీఎస్ ఆర్టీసీ జోన్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర ఆరా తీశారు. ప్రమాదం విషయం తెలిసిన వెంటనే డీపీడీవో అప్పలనారాయణ, ఈడీ విజయ్ కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ప్రమాదం జరిగిన కారణాలను అడిగి తెలుసుకున్నారు. గాయపడిన ప్రయాణికులకు అత్యవసర చికిత్స అందించాలని ఆయన ఆదేశించారు.

అంబేడ్కర్ రాజ్యాంగం అవసరం

విజయనగరం దాసన్నపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): దేశానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగం అవసరమని, ఆయన ఆశయ సాధనకు కృషి చేస్తామని ప్రజా విజయం పార్టీ వ్యవస్థాపకుడు షణ్ముఖరావు అన్నారు. నగరంలోని అంబేడ్కర్ కూడలి సమీపంలో ప్రజా గ్రంథాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ఆశయ సాధనే లక్ష్యంగా, అంబేడ్కర్ ఆశయాలే స్ఫూర్తిగా ప్రజా విజయం పార్టీ ఆవిర్భవించిందన్నారు. కార్యక్రమంలో జేవీవీ కార్య దర్శి రమేష్‌రాజు, జి.భవాని, బంగార్రాజు, మురళీమోహన్ పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి కమిటీ సమావేశం

రాజాం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని శనివారం ఉదయం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అధ్యక్షతన జరుగనుందని టీడీపీ పట్టణ అధ్యక్షుడు నంది సూర్యప్రకాశరావు ప్రకటనలో తెలిపారు. అందరూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఇంటింటా కొళాయిలు ప్రారంభం

లక్కవరపుకోట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో భీమాలి గ్రామంలో రూ.50 లక్షలతో ఇంటింటా కొళాయి పనులను శుక్రవారం ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ప్రారంభించారు. కార్యక్రమంలో గుల్లిపల్లి నాయుడు, కొయ్యాన కృష్ణ, శ్రీనురాజు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమలు తెరిపించండి

గజపతినగరం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం పరిధిలో మూత పడిన పరిశ్రమలు తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించడంలో మంత్రి దృష్టిసారించాలని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. మరుపల్లిలో జీడిపిక్కల పరిశ్రమతో పాటు భీమసింగి షుగర్ ఫ్యాక్టరీ మూతపడినప్పటికీ వాటిపై ప్రభుత్వం దృష్టిసారించకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జడ్పీటీసీ గార తవుడు తదితరులు పాల్గొన్నారు.

రామతీర్థంలో రామాయణ పారాయణం

నెల్లిమర్ల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రామతీర్థంలోని శ్రీగోదారాజగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం సింహాచలం భగవత్ రామానుజదాస బృందం ప్రతినిధులు సహస్ర శ్లోకి రామాయణ పారాయణం నిర్వహించారు. దాస బృందం ప్రతినిధి కందాల రాజగోపాలాచార్యులు ఆధర్యంలో కార్యక్రమం జరిగింది.

మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం

● రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మౌలిక సదుపాయాల విషయంలో ఈ ఆరు నెలల పాలనలో అద్భుత ఫలితాలు సాధించామన్నారు. అభివృద్ధితో పాటు సంక్షేమానికి కూడా ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఈమేరకు శుక్రవారం నగర శివార్లలోని సోనియానగర్‌లో రూ.5.19 కోట్లతో ఏర్పాటు చేసిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఎమ్మెల్యే అదితి గజపతిరాజుతో కలిసి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధికి విద్యుత్ అత్యంత కీలకమైనదన్నారు. 2014-2019 మధ్య 7 వేల మెగావాట్ల విద్యుత్ సరఫరాకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఒప్పందం చేసుకుంటే, ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ ఒప్పందాన్ని రద్దు చేసి రాష్ట్రాన్ని విద్యుత్ లోటులోకి నెట్టిందన్నారు. దీనివల్లే గత రెండేళ్లూ, విపరీతంగా విద్యుత్ కోతలు పెరిగాయన్నారు. గత ప్రభుత్వం నిర్వాకం వల్లే వినియోగదారులపై భారం పడిందన్నారు. ఈ ఆరునెలల్లో ప్రభుత్వం ఎంఓయూ చేసుకోవడమే కాకుండా గ్రీన్‌పవర్, సోలార్ పవర్‌పై దృష్టి కేంద్రీకరించిందన్నారు. ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మాట్లాడుతూ సోనియానగర్‌లో నిర్మించిన ఈ సబ్‌స్టేషన్ వల్ల టిడ్కో కాలనీతో పాటు, వైఎస్సార్ నగర్, గాజులరేగ తదితర ప్రాంతాలకు ప్రయోజనం కలుగుతుందన్నారు. 2014-2019లో వేణుగోపాలపురంలో 220 కేవీ సబ్‌స్టేషన్ మంజూరు అయ్యిందని, ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం దానిని పక్కన పెట్టిందన్నారు. రూ.200 కోట్లు వ్యయం అయ్యే ఈ సబ్‌స్టేషన్‌కు ఇటీవలే కూటమి ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. ఇది పూర్తయితే, విజయనగరం, గజపతినగరంతో భోగాపురం ఎయిర్‌పోర్టుకు బ్యాకప్‌గా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో తూర్పుకాపు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పాలవలస యశస్విని, ఎస్ఈ ఎం.లక్ష్మణరావు, ఈఈలు పి.త్రినాథరావు, పి.హరి, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

దత్తిరాజేరు: మండలంలోని ఇంగిలాపల్లి నుంచి గదబవలస బీటీ రోడ్డుకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమన్నారు. రాష్ట్రంలో రహదారుల నిర్మాణంలో నాణ్యత పాటిస్తూ గుంతలు లేని రహదారులే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందు కెళుతుందన్నారు. రూ.2.80 కోట్లతో ఈ రహదారి నిర్మాణం చేపట్టనున్నట్టు తెలిపారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో ముందుకు తీసుకువెళ్తామన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చప్ప చంద్రశేఖర్, బోడసింగి సత్తిబాబు, క్లస్టర్ ఇన్‌చార్జ్ బెజవాడ బంగారునాయుడు, ఎంపీటీసీ వంగపండు కృష్ణమూర్తినాయుడు, టీడీపీ నాయకులు తాడ్డి రవి, తహసీల్దార్ పి.విజయభాస్కర్, అధికారులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన చంద్రశేఖర్

డెంకాడ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సచివాలయంలో సీఎం చంద్రబాబును శుక్రవారం నెల్లిమర్ల నియోజకవర్గం టీడీపీ సీనియర్ నాయకుడు, డెంకాడ మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్‌రావు మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు అంశాలను సీఎంకు వివరించారు. పార్టీ బలోపేతమే ధ్యేయంగా పనిచేస్తానని, కొత్తసంవత్సరంతో నూతన ఉత్తేజంతో ముందుకు సాగుతామని సీఎంకు తెలిపారు.



సీఎంతో మాట్లాడుతున్న చంద్రశేఖర్

మధ్యాహ్న భోజనం అభినందనీయం

● మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు హర్షం

శృంగవరపుకోట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయడం అభినందనీయమని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ నంది సోమేశ్వరరావు అధ్యక్షత మండల సర్వసభ్య సమావేశం జరిగింది. స్థానిక ప్రభుత్వ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజన పథకాన్ని ప్రారంభిస్తున్నట్టు ఎంఈవో -2 పాడం లక్ష్మీగణపతి సమావేశంలో వెల్లడించారు. దాంతో సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్సీతో పాటు పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హర్షం వ్యక్తం చేశారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు కూడా వర్తింపజేయాలని కోరారు. జలజీవన్ మిషన్‌పై ఎమ్మెల్సీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వాటాను గత వైసీపీ ప్రభుత్వం చెల్లించకపోవడంతో గ్రామాల్లో పూర్తిస్థాయిలో ఇంటింటా కొళాయిల పనులు జరగలేదన్నారు. మండల పరిధిలో 340 ఎకరాల దేవాదాయ భూములు ఉంటే కేవలం 11 ఎకరాలకు మాత్రమే ఏడాదికు రూ.వెయ్యి చొప్పున శిస్తు చెల్లిస్తున్న విషయాన్ని పుణ్యగిరి దేవస్థానం ఈవో నాగేంద్ర సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. గ్రామాల్లో రీ సర్వే పనులు జరుగుతున్నాయని, తప్పులు పునరావృతం కాకుండా చూస్తున్నామని తహసీల్దార్ అరుణకుమారి తెలిపారు. ఈ సందర్భంగా కొట్టాం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులతో కలిసి టీబీ నివారణ వాల్ పోస్టరును సమావేశంలో ఆవిష్కరించారు. వైస్ ఎంపీపీలు ఇందుకూరి సుధారాణి, పినిశెట్టి వెంకటరమణ, ఎంపీడీవో సతీష్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టరును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ

లాకౌట్‌పై స్పందించని యాజమాన్యం

కొత్తవలస, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సీతంపేటలో ఉన్న ఉమా జూట్‌మిల్లు లాకౌట్ సమస్యపై యాజమాన్యం నుంచి స్పందన కరువైందని జూట్‌మిల్లు కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు గణేష్ పండా అన్నారు. శుక్రవారం జూట్‌మిల్లు సమీపంలోని కార్మికసంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. లాకౌట్ సమస్యను జనవరి 9లోగా కార్మికులతో పరిష్కరించుకుంటామని విశాఖలోని జేసీఎల్ వద్ద నిర్వహించిన సమావేశంలో యాజమాన్యప్రతినిధులు టి.సుబ్బారావు, టి. సప్తగిరి లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చారన్నారు. అయినప్పటికీ నేటికి కార్మికులతో యాజమాన్యం చర్చలు జరపలేదన్నారు. ఈనెల 9లోగా యాజమాన్యం స్పందించకపోతే ఈ నెల 11న అర్దానపాలెంలోని జూట్ మిల్లుకు సంబంధించిన 3 ఎకరాలను ఆక్రమించుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కర్రు శ్రీను, కె.ఈశ్వరరావు, ఎస్.గోవింద, ఎస్. రాంబాబు పాల్గొన్నారు.

అప్పారావు పేరు పెట్టినందుకు కృతజ్ఞతలు

శృంగవరపుకోట జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తాటిపూడి రిజర్వాయర్‌కు స్వతంత్ర సమరయోధుడు గొర్రిపాటి బుచ్చిఅప్పారావు పేరును కూటమి ప్రభుత్వం పునరుద్ధరించినందుకు శృంగవరపుకోట పుణ్యగిరి వెలమ సంక్షేమ సంఘం కృతజ్ఞతలు తెలిపింది. శుక్రవారం ఓ ప్రైవేట్ కళాశాలలో సంఘ సభ్యులు సమావేశమయ్యారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, వెలమ కార్పొరేషన్ చైర్మన్ పి.వి.జి.కుమార్ కృషిని అభినందించారు. గొర్రిపాటి స్వతంత్ర సమరయోధుడిగా, తాటిపూడి జలాశయ నిర్మాణానికి ఎంతో కృషి చేశారని సంఘ గౌరవ సలహాదారుడు జి.ఎస్.నాయుడు కొనియాడారు. ఇలాంటి వ్యక్తి పేరు పెట్టడం హర్షణీయమన్నారు. ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షను కూటమి ప్రభుత్వం గౌరవించిందన్నారు. సమావేశంలో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కొల్లి కోటేశ్వరరావు, చప్ప శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సమష్టి కృషితో నగరాభివృద్ధి

విజయనగరం రింగురోడ్డు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అందరి సమష్టి కృషితో నగరాభివృధి చేపడుతున్నామని నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం నగరపాలక సంస్థ మందిరంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. అజెండాలోని 8 అంశాలపై చర్చ అనంతరం వాటిని సభ్యులు ఆమోదించారు.

కార్మికులతో చర్చలు విఫలం

చీపురుపల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్లాం వెంకటరామ కోళ్ల పరిశ్రమ కార్మికుల సమస్యలపై శుక్రవారం జరిగిన చర్చలు విఫలమయ్యాయి. తమ వేతన సవరణను అమలు చేయాలని కార్మికులు కొన్నాళ్లుగా నిరవధిక దీక్షలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇటీవల పరిశ్రమను సందర్శించిన చీపురుపల్లి ఆర్డీవో సత్యవాణి, డీఎస్పీ ఎస్.రాఘవులు ఇరువర్గాలతో మాట్లాడారు. శుక్రవారం ఆర్డీవో కార్యాలయంలో ఇరువర్గాలతో చర్చించారు. యాజమాన్యం మొండి వైఖరిని విడనాడి, ఆమోదయోగ్యమైన మరో మాట చెప్పాలని కార్మికుల తరఫున హాజరైన సీపీఎం జిల్లా ప్రతినిధులు టి.వి.రమణ, అంబల్ల గౌరినాయుడు యాజమాన్యాన్ని కోరారు. దీనికి జీఎం హరికృష్ణ, డీజీఎం గౌరిలు మాట్లాడుతూ గతంలో తాము అంగీకరించిన విధంగా రూ.300 పెంపుదలకు తాము సిద్ధమన్నారు. దానికి బదులుగా మరో సవరణ చేయాలంటే యాజమాన్యం నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. దీనికి యూనియన్ నాయకులు స్పందిస్తూ ఈనెల 7న డీసీఎల్ వద్ద జరగనున్న చర్చల్లో దీనిపై స్పష్టతనివ్వాలని కోరారు. అప్పటి వరకూ కార్మికులు నిరవధిక దీక్షలు కొనసాగిస్తారని స్పష్టం చేశారు. చర్చల్లో చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు, రాజాం సీఐ, కార్మిక సంఘ నాయకులు గురునాయుడు, టి.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మారిక రోడ్డు పనులు ప్రారంభం

● ఆందోళన విరమించిన గిరిజనులు

వేపాడ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు వేయాలని కోరుతూ మారిక గిరిజనులు గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని ముట్టడించడం వంటవార్పు అక్కడే చేయడంతో అధికారులు దిగి వచ్చారు. గిరిజనుల డిమాండ్ మేరకు రహదారి పనుల ప్రారంభానికి శుక్రవారం అధికారులు ఏర్పాట్లు చేయడంతో గిరిజనులు ఆందోళన విరమించారు. సీపీఎం నాయకుడు చల్లా జగన్ సారథ్యంలో గిరిజనులు చేపట్టిన ఆందోళనపై ఇంజనీరింగ్ అధికారులు, ఎస్.కోట రూరల్ సీఐ ఎల్.అప్పలనాయుడు, ఎంపీడీవో సూర్యనారాయణ, వేపాడ ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు.. గిరిజనులతో శుక్రవారం మాట్లాడారు. రహదారి పనులు ప్రారంభించే వరకు నిరసన విరమించేది లేదని గిరిజనులు బదులివ్వడంతో కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు ప్రారంభించే ఏర్పాటు చేశారు. అధికారుల చర్యలకు సంతృప్తి చెందిన గిరిజనులు ఆందోళన విరమించారు. అవాంఛనీయ ఘటనలు జరగ కుండా వల్లంపూడి ఎస్ఐ బి.దేవి బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఈనేపథ్యంలో మారిక రోడ్డును అటవీశాఖ అధికారులతో పాటు పీఆర్ ప్రాజెక్టు ప్రత్యేక విభాగం డీఈఈ జి.ఎస్.ఎన్.మూర్తి, ఏఈఈ ఐశ్వర్య పరిశీలించారు.



గిరిజనులతో మాట్లాడుతున్న అధికారులు

హుండీ ఆదాయం రూ.4.48 లక్షలు

చీపురుపల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కనకమహలక్ష్మి అమ్మవారి హుండీ ఆదాయం రూ.4,47,668 లభించినట్టు ఈవో బి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది సెప్టెంబరు 9 నుంచి 2025 జనవరి 3 వరకూ హుండీ ద్వారా వచ్చిన ఆదాయాన్ని లెక్కించామని పేర్కొన్నారు. దేవాదాయ శాఖ తనిఖీ అధికారి జి.శ్యామ్ ప్రసాద్ ఆధ్వర్యంలో లెక్కింపు జరిగిందన్నారు. కార్యక్రమంలో అర్చకులు పాల్గొన్నారన్నారు.



హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

సమానంగా వేతనం ఇవ్వండి

నెల్లిమర్ల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజినీరింగ్, నాన్ పీహెచ్ కార్మికులకు పారిశుధ్య కార్మికులతో సమానంగా వేతనా లు ఇవ్వాలని శుక్రవారం నెల్లిమర్ల నగర పంచాయతీ కార్యాలయం ఎదుట్ల మున్సిపల్ కార్మికులు శుక్రధర్నా నిర్వహించారు. ము న్సిపల్ కమిషనర్ కె.అప్పలరాజుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీను, పైడిరాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం దాసన్నపేట : నగరపాలక సంస్థలో ఇంజనీరింగ్, నాన్ పీహెచ్ కార్మికులకు పారిశుధ్య కార్మికులకు సమానంగా వేతనాలు ఇవ్వాలని మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎ.జగన్మోహనరావు డిమాండ్ చేశారు. సమాన వేతనాలు ఇవ్వాలని కోరుతూ నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఆదినారాయణ, సత్యనారాయణ, నర్సింహులు, గౌరినాయుడు పాల్గొన్నారు.

ఆసుపత్రికి వెళ్తే.. బెడ్ షీట్లు తీసుకెళ్లాల్సిందే..!

● సదుపాయాలకు దూరంగా సుందరపేట సీహెచ్‌సీ ● పట్టించుకోని పాలకులు ● రోగులకు తప్పని అవస్థలు

భోగాపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): భోగాపురం పంచాయతీ సుందరపేటలోని సామాజిక ఆరోగ్య కేంద్రం నిర్వహణ అధ్వానంగా ఉంది. ఇక్కడి 30 పడకల ఆసుపత్రిలో రోగులకు కనీస సదుపాయాలు కరువయ్యాయి. దీంతో రోగులు ఆవేదన చెందుతున్నారు. ఈ ఆసుపత్రికి భోగాపురం, పూసపాటిరేగ, డెంకాడ మండలాలకు చెందిన ప్రజలతో పాటు జాతీయ రహదారిని ఆనుకుని ఉండడంతో రోడ్డు ప్రమాదాలకు గురైన వారు ఇక్కడే వైద్య సేవలు పొందుతుంటారు. ప్రతీరోజు సుమారు 200 నుంచి 250 వరకు ఓపీ ఉంటుంది. 10 నుంచి 20 మంది ఇన్ పేషెంట్లుగా రోజూ ఆసుపత్రిలోనే ఉంటూ సేవలు పొందుతుంటారు. అలాంటి వారికి మంచాలు కేటాయిస్తున్నారు తప్ప.. మంచాలపై బెడ్ షీట్లు ఇవ్వడంలేదు. దీంతో ఆసుపత్రిలో చేరాలనుకునే వారు ఇళ్ల నుంచి బెడ్ షీట్లు తీసుకెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఇళ్ల నుంచే దుప్పట్లు, దిండ్లు రోగులే తెచ్చుకుంటున్నారు. దీనిపై సీహెచ్‌సీ వైద్యాధికారి వెంకటేష్‌ని వివరణ కోరగా.. కరోనా వచ్చినప్పటి నుంచి ఆసుపత్రికి బెడ్ షీట్లు సరఫరా నిలిపి వేశారన్నారు. ఇటీవల కొన్ని నెలల పాటు డిస్పోజబుల్ (ఒకసారి ఉపయోగించి పారవేసే) పేపర్ బెడ్ షీట్లు సరఫరా చేశారన్నారు. వాటినీ ప్రస్తుతం నిలుపుదల చేశారని తెలిపారు. అయితే మరి కొద్ది రోజుల్లో బెడ్ షీట్లు ఆసుపత్రికి సరఫరా జరిగే అవకాశం ఉందని తెలిపారు.



ఆసుపత్రిలో బెడ్స్‌పై లేని దుప్పట్లు

పోక్సో కేసులో వ్యక్తికి 25 ఏళ్ల జైలు

రామభద్రపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో ఒక వ్యక్తికి 25 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ పోక్సో ప్రత్యేక న్యాయాధికారిణి కె.నాగమణి శుక్రవారం తీర్పు ఇచ్చారు. ఈ కేసుకు సంబందించిన వివరాలను ఎస్పీ వకుల్ జిందాల్ శుక్రవారం విజయనగరం జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో విలేకర్లకు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గత ఏడాది జూలై 13న రామభద్రపురం మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఆరు నెలల పసిపాపపై ఇదే మండలం జన్నివలస పంచాయతీ నేరెళ్లవలస గ్రామానికి చెందిన బోయిన ఎరకన్నదొర లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రామభద్రపురం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఈ కేసును బొబ్బిలి డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాసరావు దర్యాప్తు చేసి, నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో అభియోగాలు దాఖలు చేశారు. ఆరు నెలల వ్యవధిలోనే ఈ కేసులో ట్రైల్‌ను పూర్తిచేసి సకాలంలో సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. నేరం రుజువు కావడంతో ఎరకన్నదొరకు పోక్సో ప్రత్యేక న్యాయాధికారిణి నాగమణి శిక్ష ఖరారు చేశారు.ఈ కేసులో క్రియాశీలంగా వ్యవహరించిన బొబ్బిలి డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాసరావు, అప్పటి బొబ్బిలి రూరల్ సీఐ ఎస్.తిరుమలరావు, అప్పటి ఎస్ఐ జ్ఞానప్రసాద్, ప్రస్తుత బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావు, ప్రస్తుత రామభద్రపురం ఎస్ఐ వి.ప్రసాదరావు, హెచ్‌సీ వీఎల్‌వీ నారాయణ, కానిస్టేబుల్ వై.అప్పలనాయుడు, తెర్లాం ఏఎస్ఐ కె.పూడినాయుడు, సీఎంఎస్ హెచ్‌సీ రామకృష్ణలను ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు.

సారాతో మహిళ అరెస్టు

విజయనగరం క్రైం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): గుర్ల మండలం దేవునికణపాకలో సారా విక్రయిస్తున్న మహిళను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ రామారావు శుక్రవారం అరెస్ట్ చేశారు. చోడిపల్లి లక్ష్మి సారా విక్రయిస్తుండగా దాడి చేసి ఆమెను అదుపులోకి తీసుకుని, 5 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. దాడిలో హెచ్‌సీ నాగేశ్వరరావు, కానిస్టేబుళ్లు నాయుడు, మనోజ్, ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కుమ్మపల్లిలో మరొకరు..

వేపాడ, జనవరి 3 ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమ్మపల్లిలో సారాతో ఓ మహిళను అరెస్టు చేశామని వల్లంపూడి ఎస్ఐ బొడ్డు దేవి తెలిపారు. ఆమె నుంచి 7 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు.

బస్సు బోల్తా.. ఆరుగురికి స్వల్ప గాయాలు

మెంటాడ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుచ్చి రాజుపేట, గుర్మమ్మవలస గ్రామాల మధ్య శుక్రవారం మధ్యాహ్నం ఆర్టీసీ బస్సు బోల్తా పడింది. ఈ ఘటనలో బస్సులో ఉన్న ఆరుగురు ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. విజయనగరం నుంచి జక్కువ వెళ్తున్న బస్సులో సాంకేతిక సమస్య తలెత్తి గుర్మమ్మవలస సమీపంలోని మలుపు వద్ద పొలాల్లో బోల్తా కొట్టింది. ప్రమాద సమయంలో బస్సులో ఆరుగురు ప్రయాణికులు మాత్రమే ఉన్నారు. వీరంతా జక్కువ గ్రా మానికి చెందిన వారు కాగా, వారిలో ముగ్గురు ఒకే కుటుంబానికి చెందిన వారు. ఇంకో పది నిమిషాల్లో గ్రామానికి చేరుకుంటున్న సమయంలో పంటపొలాల్లో బస్ బోల్తా పడింది. బస్సు ప్రమాద ఘటనలో మహిళా కండ క్టర్ సుజాత షాక్‌కు గురయ్యారు. ఆమె కాలికి స్వల్ప గాయమైంది. మలుపులు అధికంగా ఉన్న ఈ రూట్‌లో డ్రైవర్ భాస్కరరావుకు డ్యూటీ ఇదే తొలిసారని సమాచారం. ఘటనా స్థలానికి ఆండ్ర ఎస్ఐ సీతారాం చేరుకుని ప్రమాద వివరాలు తెలుసుకున్నారు.



పొలాల్లో బోల్తా పడిన బస్సు

దాడి కేసు నమోదు

భోగాపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజాపులోవలో జరిగిన దాడిపై బాధితుడు కిలారి రాజేంద్రవర్మ, మణిలోకేష్ ఇచ్చిన ఫిర్యాద మేరకు కేసు నమోదు చేశామని సీఐ ఎస్వీ ప్రభాకర్ తెలిపారు. రాజాపులోవ గ్రామానికి చెందిన కిలారి రాజేంద్రవర్మ మణిలోకేష్ ఈనెల 1న గ్రామ సమీపంలోని ఆలయం వద్ద ద్విచక్రవాహనంపై కూర్చొని స్నేహితుడుతో మాట్లాడుతున్నాడు. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన కిలారి సిద్ధు, చందక కాశీ ఇద్దరు వచ్చి పాత కక్షలు కారణంతో కొట్టారని దీంతో తీవ్రంగా గాయాలు కావడంతో విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు.

మహిళా కానిస్టేబుల్ ఉద్యోగ నియామక ప్రక్రియ ప్రారంభం

విజయనగరం క్రైం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): స్టైపెండరీ మహిళా పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగ నియామాకాలకు ప్రాథమిక రాత పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు పీఎంటీ, పీఈటీ పరీక్షల ప్రక్రియ ప్రారంభమైంది. కార్యక్రమాన్ని ఎస్పీ వకుల్ జిందల్ పర్యవేక్షించారు. ఈ పరీక్షలకు 500 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 314 మంది హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సౌమ్యలత, ఏఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు, డీఎస్పీలు ఎం.వీరకుమార్, ఎస్.బాలాజీ, టి.ఎన్.శ్రీనివాసరావు ఉన్నారు.

సీఐ, ఎస్ఐలను సస్పెండ్ చేయండి

శృంగవరపుకోట జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లాలో న్యాయవాది మృతికి కారణమైన సీఐ, ఎస్ఐలను సస్పెండ్ చేయాలని శృంగ వరపుకోట బార్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.సూరిదేముడు, బి.సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం న్యాయవాదులు పట్టణంలో ఆందోళన చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు గేదెల ప్రకాశరావు, బి.రామకృష్ణ, ఎం.కామేశ్వరరావు తదితరులు వున్నారు.

బాధితుల సమస్యలను పరిష్కరించండి

శృంగవరపుకోట జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో సహారా ఇండియా బాధితులు ధర్నా చేశారు. ఏజెంట్లు, ఖాతాదారులు ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి దేవిబొమ్మ కూడలి వరకు విశాఖ-అరకు రోడ్డులో భారీ ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ నాయకుడు తమ్మినేని సూర్యనారాయణ, మద్దిల రమణ తదితరులు ఉన్నారు.

చెరువు పరిశీలన

భోగాపురం, జనవరి3 (ఆంధ్రజ్యోతి): గూడెపువలసలో కొండ్రాజు చెరువు కలుషితమైనట్టు స్థానికులు ఎమ్మెల్యే లోకం నాగమాధవికి ఫిర్యాదు చేసిన నేపథ్యంలో శుక్రవారం జనసేన నాయకులు చెరువును పరిశీలించారు. చెరువు పరిశీలించిన వారిలో లోకంప్రసాద్, గజపతినగరం జనసేన పార్టీ ఇన్‌చార్జి ఎం.సురేష్, సర్పంచ్ అయ్యప్పరెడ్డి ఉన్నారు.

హామీలు అమలు చేస్తున్నాం

● పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర



రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

బలిజిపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒకొక్కటిగా నెరవేరుస్తున్నామని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర తెలిపారు. బలిజిపేట మండలంలో గలావిల్లి గ్రామం నుంచి కొత్త గలావిల్లి గ్రామం వరకు రూ.2కోట్లతో చేపట్టిన తారు రోడ్డు నిర్మాణానికి ఆయన శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితులను ఆదుకుంటాం

శ్రీరంగరాజపురంలో కిడ్నీ బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే విజయచంద్ర భరోసా ఇచ్చారు. గ్రామానికి సరఫరా అవుతున్న తాగునీటిని ఆయన శుక్రవారం పరిశీలించారు. కిడ్నీ వ్యాధితో ఇటీవల ఇద్దరు మృతి చెందడం బాధాకరమని, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. గ్రామానికి రహదారి సౌకర్యంతో పాటు కిడ్నీ బాధితులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

భవిత కేంద్రానికి ఆట వస్తువులు

బొబ్బిలి రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక భవిత కేంద్రంలో చిన్నారులకు కారాడ చైల్డ్ ఇంపాక్ట్ ఇనిషియేటివ్ ఫౌండేషన్ సన్‌రైజ్ హోం వ్యవస్థాపకుడు రాజు వర్మ ఆట వస్తువులు, సామగ్రిని సమకూర్చారు. ఈ వస్తువులను ఎమ్మెల్యే బేబీనాయన శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-1 సీహెచ్ లక్ష్మణరావు, ఎంఈవో-2 గొట్టాపు వాసుదేవరావు, ఎంపీడీవో పి.రవికుమార్, టీడీపీ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు అల్లాడ భాస్కరరావు, హెచ్ఎం కృష్ణమోహన్, ఫిజియోథెరపిస్టు శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

చేపలు, రొయ్యల సరఫరా బాధ్యత ఎఫ్ఎఫ్‌పీవోదే

పాలకొండ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఇకపై చేపలు, రొయ్యల సరఫరా బాధ్యత ఎఫ్ఎఫ్‌పీవోదేనని జిల్లా మత్స్యశాఖాధికారి డి.గోపీ కృష్ణ అన్నారు. పట్టణంలోని మత్స్యశాఖ కార్యాలయంలో పాలకొండ, సీతంపేట, వీరఘట్టం, భామిని మండలాల ఫిషర్‌మేన్ కో-ఆపరేటివ్ సొసైటీ సభ్యులతో ఆయన శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి శాస్త్రీయ యాజమాన్య పద్ధతుల ద్వారా చేపల పెంపకం, పెట్టుబడిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాలకొండ మత్స్యకారుల సహకార సంఘం అధ్యక్షుడు సిద్దాంతం సత్యం, లుంబూరు సొసైటీ అధ్యక్షుడు బెహరా చిన్నారావు, వీరఘట్టం సంఘం అధ్యక్షుడు పాపారావు, తెట్టంగి సొసైటీ అధ్యక్షుడు రామన్నదొర, భామిని, బాలేరు, సీతంపేట మత్స్యకార సొసైటీ అధ్యక్షులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు మరింత మెరుగు పర్చాలి

జియ్యమ్మవలస, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆశ్రమ పాఠశాలల్లో పరిసరాల పరిశుభ్రత తోపాటు విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపర్చాలని జిల్లా ఆహార భద్రత అధికారి రామయ్య అన్నారు. ఆయన శుక్రవారం రాత్రి పల్లె నిద్రలో భాగంగా వనజ జీటీడబ్ల్యూఏ హెచ్ స్కూల్‌ను సందర్శించారు. పాఠశాల పరిసరాలు, మరుగుదొడ్ల నిర్వహణ, తాగునీటి సదుపాయం, మౌలిక వసతులు, విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం హెచ్ఎం అల్లు రవికుమార్, ఉపాధ్యాయులతో సమావేశమై పలు సూచనలు చేశారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు.

కురుపాంలో పల్లె నిద్ర

కురుపాం, జనవరి3 (ఆంధ్రజోతి): విద్యార్థుల విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపర్చాలని జిల్లా బీసీ సంక్షేమ సాధికారత అధికారి కృష్ణ కోరారు. పల్లెనిద్రలో భాగంగా గురువారం రాత్రి స్థానిక మహాత్మా జ్యోతిబాపులే బీసీ సంక్షేమ రెసిడెన్షియల్ స్కూల్‌ను ఆయన పరిశీలించారు. పాఠశాల నిర్వహణ, మెనూ, విద్యార్థుల విద్యా ప్రమాణాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం కూడా గ్రామంలో పర్యటించారు. సచివాలయాన్ని సందర్శించారు. కురుపాం-2 పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సత్యనారాయణ, పంచాయతీ ఈవో ధనుజయరావు, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

వారపు సంతకు సంక్రాంతి శోభ



రద్దీగా మారిన వారపుసంత

మక్కువ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రతి శుక్రవారం జరిగే వారపు సంతకు సంక్రాంతి శోభ సంతరించుకుంది. వస్త్రాలు, నిత్యావసర సరుకులు కొనుగోలు చేసుకొనేందుకు వచ్చిన గిరిజనులతో మార్కెట్ జంక్షన్ రద్దీగా మారింది. రద్దీతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. కిరాణా, వస్త్ర దుకాణాలు ప్రజలతో కిటకిటలాడాయి. ప్రధాన రహదారిపైనే వారపు సంత జరుగుతుండడంతో ప్రజలు నడిచేందుకు అవస్థలు పడ్డారు.

విశ్వతేజ పుస్తకావిష్కరణకు ఆహ్వానం

పాలకొండ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పాలకొండలో ఈనెల 5న నిర్వహించనున్న విశ్వతేజ పుస్తక ఆవిష్కరణ కార్యక్రమానికి బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయనను పుస్తక రచయిత కనపాక చౌదరినాయుడు శుక్రవారం ఆహ్వానించారు. అలాగే కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి ఆహ్వాన పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో పామోటి చిన్నంనాయుడు, బుడితి అప్పలనాయుడు, బబ్బాది తవిటినాయుడు, పాలవలస సత్యనారాయణ, రౌతు రామ్మూర్తినాయుడు పాల్గొన్నారు.

చౌయితి వేడుకలు పునః ప్రారంభం



కూచిపూడి నృత్యరూపకం

రాయగడ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కళలు వారసత్వ సంపదలని, వాటిని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని జిల్లా అదనపు కలెక్టర్ భాస్కరచంద్ర రోయిత్ అన్నారు. డిసెంబరు 26 నుంచి 30 వరకు జరగాల్సిన జిల్లా సాంస్కృతిక ఉత్సవం చౌయితి వేడుకలు దేశ పూర్వప్రధాని మన్మోహన్ సింగ్ మృతితో వాయిదా పడ్డాయి. మళ్లీ గురువారం సాయంత్రం స్థానిక జీసీడీ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో పునః ప్రారంభమయ్యాయి. ఈ ప్రారంభ వేడుకలో జిల్లా అదనపు కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో జడ్పీ కార్యనిర్వాహణాధికారి అక్షయ్‌కుమార్ ఖెముండి, నగర పురపాలక సంస్థ అధ్యక్షులు మహేష్ పట్నాయక్, 11 సమితిలకు చెందిన అధ్యక్షులు, ఇతర సభ్యులు పాల్గొన్నారు. ఈసందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి.

ఒడిశా

అద్దె వాహనంలా ఎండీయూ వ్యాను

● చోద్యం చూస్తున్న అధికారులు

● ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్న ప్రజలు

గరుగుబిల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రావివలస, లఖనాపురం పంచాయతీల్లో నిత్యావసర సరుకుల పంపిణీకి ఎండీయూ వాహనాన్ని గతంలో మంజూరు చేశారు. కానీ నిత్యావసర సరుకులకు బదులుగా గ్రామంలో సిమెంటు, ఇటుకలతో పాటు వివిధ రకాల సామగ్రి తరలింపునకు దీనిని వినియోగిస్తున్నారు. ప్రభుత్వ వాహనం... ఇలా అద్దె వాహనంలా తయారవ్వడంతో గ్రామస్థులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. మరికొన్ని పంచాయతీల్లోనూ ఇదే పరిస్థితి ఉందని స్థానికులు చెబుతున్నారు. రేషన్ దుకాణాల పరిధిలోని రేషన్ బియ్యం అక్రమ రవాణా చేయడంలో వీరి పేరే ప్రధానంగా వినిపిస్తోంది. వీటిలో బియ్యం తరలించినా.. ఇతరులకు అనుమానం లేకుండా ఉంటుందన్న ఉద్దేశంతో అక్రమాలకు పాల్పడుతున్నారు. వాహనాల్లో తరలిస్తున్న విషయమై నిర్వాహకుడిని స్థానికులు ప్రశ్నిస్తే.. దురుసుగా సమాధానం ఇస్తున్నాడు. సంబంధిత అధికారులు దీనిపై చర్యలు తీసుకొని.. అక్రమాలను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఎండీయూ వాహనంలో సిమెంటు బస్తాలను తరలిస్తున్న దృశ్యం

లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందాలి

కురుపాం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అందిస్తున్న పథకాలు గ్రామ స్థాయిలో ప్రతి ఒక్క లబ్ధిదారుడికి అందేవిధంగా కూటమి నాయకులు కృషిచేయాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేశ్ చంద్రదేవ్ కోరారు. శుక్రవారం కురుపాం కోటలో ఆయన ఆధ్వర్యంలో కూటమి నాయకుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన భవిష్యత్తు కార్యాచరణ, ప్రణాళికలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పట్టాలు మంజూరు చేయండి

పాచిపెంట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల కాలంగా సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు మంజూరు చేయాలని పద్మాపురం పంచాయతీ పరిధిలోని 14 గ్రామాల రైతులు కోరారు. ఈ మేరకు శుక్రవారం పద్మాపురం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ డి.రవికి వినతిపత్రాన్ని అందజేశారు. సుమారు 5 వేల ఎకరాల్లో 400 మంది రైతుల వరకు సాగులో ఉన్నారని చెప్పారు. జిరాయితీ భూములు అయినప్పటికీ ఇనాం భూమి అంటూ అధికారులు నిర్లక్ష్యం వహిస్తూ తాత్సారం చేస్తున్నారని ఆరోపించారు. తగు చర్యలు చేపట్టి రైతులకు పట్టాలు మంజూరు చేయాలని కోరారు. ఈ సదస్సులో ఎంపీపీ బడ్నాన ప్రమీల, సర్పంచ్ బి.వీరయ్య, పాచిపెంట వీరంనాయుడు, డోల బాబ్జీ, తదితర రైతులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు రవాణా భత్యం

బాడంగి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో దివ్యాంగ విద్యార్థులకు రవాణా భత్యం విడుదలైనట్టు హెచ్ఎం డి.సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన పాఠశాల వద్ద మాట్లాడారు. 11మంది దివ్యాంగులకు రూ.3వేల చొప్పున రవాణా భత్యం, ఆరుగురికి ఎస్కార్ట్ అలెవెన్సు కింద రూ.3వేల చొప్పున వారి బ్యాంకు ఖాతాలకు మెండార్ కోడ్ ద్వారా జమ చేసినట్టు చెప్పారు. అలాగే 21మంది దివ్యాంగ బాలికలకు ఒక్కొక్కరికి రూ.2వేల చొప్పున స్టయిఫండ్ వారి బ్యాంకు ఖాతాలకు జమ చేస్తారని హెచ్ఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ సభ్యులు డి.శ్రీనివాసరావు, ప్రత్యేక ఉపాధ్యాయుడు కొల్లి ఈశ్వరరావు, దివ్యాంగ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అడవులను సంరక్షించుకోవాలి

మక్కువ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అడవులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని విశాఖపట్నం సర్కిల్ ఫారెస్ట్ రేంజ్ అధికారి కె.శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం సాలూరు రేంజ్ మక్కువ సెక్షన్ దుగ్గేరు బీట్ పరిధి మూలవలస గ్రామంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవుల్లో నిప్పు పెట్టడం వల్ల ప్రకృతి నాశనం అవుతుందని తెలిపారు. అడవుల్లో గంజాయి సాగు చట్టరీత్యా నేరమన్నారు. గంజాయి సాగుతో జైలు శిక్షలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మక్కువ అటవీ సెక్షన్ అధికారి కేతిరెడ్డి నారాయణరావు, బీట్ ఆఫీసర్లు గణపతి, సతీష్, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వెంకన్నకు విశేష దీపాలంకరణ సేవ



బొబ్బిలి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి స్థానిక కంచర వీధి కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో విశేష దీపాలంకరణ సేవ నిర్వహించారు. ఆలయ అర్చకుడు శ్రీనివాసాచార్యులు, భక్తసంఘం ప్రతినిధుల ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో వివిధ ఆకారాల్లో దీపాలు వెలిగించారు.

ఇలా అయితే సాగునీరు అందేదెలా?

● ఊడిన గుమ్మిడిగెడ్డ అక్విడెక్టు తలుపు ● వృథాగా గెడ్డలోకి పోతున్న నీరు

కురుపాం/ రూరల్, జనవరి3(ఆంధ్రజ్యోతి): కురుపాం సమీపంలో గల గుమ్మిడిగెడ్డ అక్విడెక్టు వద్ద గత రెండు రోజుల కిందట ఒక తలుపు ఊడిపోయింది. దీంతో సాగు నీరు వృథాగా గెడ్డలో కలిసిపోతుంది. దీంతో వరి పొలాలకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి తలుపు మరమ్మతులు చేపట్టాలని నీటి సంఘం అధ్యక్షులు పండాల శ్రీనివాసరావు, మరాపు సింహాచలం, బంటు తవిటినాయుడు, తెంటు జగనాథం నాయుడు, పోలిరెడ్డి శ్రీనివాసరావు కోరారు. ఈ విషయం ఇరిగేషన్ అధికారులకు తెలియజేశామని తెలిపారు. ● దీనిపై గుమ్మిడిగెడ్డ మినీ రిజర్వాయర్ జేఈ జి.భావనకు వివరణ కోరాగా రైతులు శుక్రవారం ఈ విషయాన్ని తెలియజేశారని చెప్పారు. అయితే ఎన్నికల విధులు ఉండటంతో వెళ్లలేకపోయామని, ఈ విషయం డీఈఈకి తెలియజేశామన్నారు. వెంటనే తాత్కలికంగా పనులు చేపట్టి రబీకి నీరు అందిస్తామని తెలిపారు.



తలుపు ఊడిపోవడంతో వృథాగా పోతున్న నీరు

ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

రామభద్రపురం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): దుప్పలపూడి పంచాయతీ రొంపల్లివలస గ్రామంలో రెవెన్యూ అధికారులు గిరిజనుల హక్కులు కాల రాస్తున్నారని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పి.శంకరరావు, మండల కార్యదర్శి బలసా శ్రీనివాసరావు ఆరోపించారు. శుక్రవారం వారు రొంపల్లివలస గ్రామాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు 40 ఎకరాల డీపట్టా భూమిని భూస్వాములు ఆక్రమించినా రెవెన్యూ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. గిరిజన గ్రామంలో సుమారు 50 కుటుంబాలు సెంటుభూమి లేకుండా ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రెవెన్యూ రికార్డులలో లోపాలను అడ్డుపెట్టుకుని భూస్వాములు కొద్ది సంవత్సరాలు ఆ భూములు అనుభవిస్తున్నారని, వీటిపై సమగ్ర విచారణ జరిపి నిరుపేద గిరిజనులకు ఆ భూములు పంపిణీ చేయాలని కోరారు. అలాగే గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డుకు గిరిజనుల భూమిని తీసుకుని రికార్డులు తారుమారు చేసి అర్హులకు నష్ట పరిహారం చెల్లించకుండా రెవెన్యూ, గ్రీన్‌ఫీల్డ్ అధికారులు అవినీతికి పాల్పడ్డారని, వీటిపై కూడా విచారణ చేపట్టాలని వారు కోరారు.

ప్రజారోగ్యంపై జాగ్రత్తలు పాటించాలి

● మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజరు విమల

సీతానగరం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రజారోగ్యం పట్ల అధికారులు జాగ్రత్తలు పాటించాలని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజరు వై.విమల ఆదేశించారు. మండలంలోని జోగింపేట గ్రామంలో మండల అధికారులతో కలిసి ఆమె గ్రామదర్శిని కార్యక్రమం నిర్వహించారు. ముందుగా విద్యాలయాల సముదాయంలో పారిశుధ్య పనులు నిర్వహించడాన్ని పరిశీలించారు. జోగింపేటలో అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. కాలువలను పరిశీలించారు. సచివాలయంలో ఉద్యోగుల రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్య పనులు నిర్వహించాలన్నారు. తాగునీటి ట్యాంకు నుంచి విడుదలైన వృథా నీరు ఇంకింపజేసేందుకు ఇంకుడు గుంతలు తీయించాలని అధికారులకు సూచించారు. గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీకి యార్డుకు అవసరమైన ప్రభుత్వ భూమిని కేటాయించాలన్నారు. గ్రామంలో పారిశుధ్య పనులు నిర్వహించడానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో పి.త్రివిక్రమరావుకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసన్నకుమార్, ఎంఈవో జి.సూరిదేముడు, ఏపీవో భాను, ఏపీఎం రెడ్డి శ్రీరాములు, ఈవోపీఆర్డీ కె.కుమారవర్మ, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తాటిపూడికి గౌర్రిపాటి పేరుపై హర్షం

బొబ్బిలి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని తాటిపూడి రిజర్వాయర్‌కు ఉత్తరాంధ్ర కొప్పల వెలమ నేత గౌర్రిపాటి బుచ్చి అప్పారావు పేరును పునరుద్ధరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల బొబ్బిలి కొప్పల వెలమ సేవా సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక వెలమవారి ఫంక్షన్ హాలులో సేవా సంఘం నాయకులు కర్రి సత్యనారాయణ, లచ్చుపతుల జగన్నాథం, కోరెడ్ల చినఅప్పలస్వామి, మూడడ్ల లక్ష్మయ్యలు సమావేశమై అప్పారావుకు నివాళులు అర్పించారు. జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి తదితరుల విజ్ఞప్తి మేరకు సీఎం చంద్రబాబు సానుకూలమైన నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని అన్నారు. కేతిరెడ్డి కృష్ణమూర్తి, మరడ అప్పారావు, కొల్లి రామారావు, వంగపండు శ్రీరాములు పాల్గొన్నారు. ● గరుగుబిల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తాటిపూడి రిజర్వాయర్‌కు స్వాతంత్ర్య సమరయోధుడు గౌర్రిపాటి అప్పారావు పేరు పెట్టడంపై కొప్పల వెలమ సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ అక్కేన మధుసూదనరావు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ బీసీ వర్గానికి చెందిన కొప్పల వెలమకు కూటమి ప్రభుత్వం తగిన గుర్తింపు ఇచ్చిందన్నారు. మంత్రులు నారా లోకేశ్, కింజరాపు అచ్చెన్నాయుడు, నిమ్మల రామానాయుడు, స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారిలకు కృతజ్ఞతలు తెలిపారు. ● బాడంగి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): తాటిపూడి రిజర్వాయర్‌కు స్వాతంత్ర సమరయోధుడు, సామాజిక ఉద్యమకారుడు దివంగత గౌర్రిపాటి బుచ్చి అప్పారావు పేరును పునరుద్ధరించడంపై కొప్పలవెలమ కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లి అప్పలనాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు నిమ్మల రామానాయుడు, కొండపల్లి శ్రీనివాస్, ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్, కూటమి ప్రభుత్వ పెద్దలకు ఆయన శుక్రవారం ధన్యవాదాలు తెలిపారు.

ఉపాధి పనులు వేగవంతం చేయాలి

● డ్వామా పీడీ శారద

బొబ్బిలి రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ కింద చేపట్టిన పనులను మూడు నెలల్లో ముగించాలని డ్వామా పీడీ ఎస్.శారద సూచించారు. శుక్రవారం బొబ్బిలి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోలు, ఏపీవో, సాంకేతిక సహాయకులతో సమావేశం నిర్వహించి, మాట్లాడారు. మండలానికి పల్లె పండగలో భాగంగా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం ప్రకారం అమృత సరోవర్ పథకం కింద అన్ని పంచాయితీలలో గ్రామాలకు దగ్గరలో ఉన్న చెరువులను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. అలాగే ప్రతి గ్రామంలో ఫిష్ పాండ్లు నిర్మించాలన్నారు. ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు జరిగినా, నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో లక్ష్మీపతిరాజు, ఎంపీడీవో పి.రవికుమార్, సాంకేతిక సహాయకులు పాల్గొన్నారు.





వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

ఘనంగా ముగ్గుల పోటీలు

బొబ్బిలి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలోని సింగారుపువీధి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం సంక్రాంతి సంబరాల్లో భాగంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఆలయధర్మకర్త గెంబలి శ్రీనివాసరావు, భక్తసంఘం ప్రతినిధి చెలికాని వేణుగోపాలరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో మహిళలు చాలా ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీలో మొదటి స్థానం పొందిన విజేతకు వెండి పట్టీలు బహుమతిగా అందజేశారు. మిగిలిన ఐదు బహుమతులు పొందిన వారికి చీరలను బహూకరించారు.

కాలువల్లో పూడికలు తొలగించండి

బొబ్బిలి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పాత బొబ్బిలిలోని పల్లి వీధి, పళ్లెం వీధి, కూరాకుల వీధి, దిబ్బ వీధి ప్రాంతాలను మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి శుక్రవారం పర్యటించారు. కాలువల్లో పూడికలు తొలగించాలని శానిటరీ సిబ్బందిని ఆదేశించారు. పళ్లెం వీధిలో కాలువల్లో నుంచి తీసిన పూడికలను అక్కడ నుంచి తరలించాలని ఆమె ఆదేశించారు. మున్సిపల్ కొళాయిల నుంచి వస్తున్న తాగునీటికి పరీక్షలు జరిపించారు. నీటి నాణ్యత విషయంలో ఎటువంటి రాజీపడవద్దని సిబ్బందికి సూచనలిచ్చారు. గ్రామంలో నిర్మిస్తున్న మురుగునీటి శుద్ధి ప్లాంటు పనులను ఆమె పరిశీలించారు. కౌన్సిలర్లు చోడిగంజి రమేష్‌నాయుడు, కోట పెదరాములు, ఏఈ గుప్త, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

కలెక్టర్‌ని కలిసిన నీతిఅయోగ్ సంయుక్త కార్యదర్శి



పార్వతీపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): నీతి అయోగ్ సంయుక్త కార్యదర్శి కేఎస్ రాజీమన్ శుక్రవారం స్థానిక కలెక్టర్ కార్యాలయానికి విచ్చేశారు. కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛాన్ని అందజేసి, శాలువతో సన్మానించారు. ఈసందర్భంగా నీతి అయోగ్ ఆశావహ జిల్లాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు, ప్రణాళికపై కలెక్టర్‌తో చర్చించారు. ఆశావహ జిల్లాల్లో ఏర్పాటు చేయనున్న స్కిల్‌హబ్ సెంటర్, గ్రామ విజ్ఞాన కేంద్రాల వివరాలను తెలిపారు. జిల్లా అభివృద్ధికి ప్రణాళికా బద్ధంగా కృషి చేస్తున్న విధానానికి సంతృప్తి వ్యక్తం చేశారు. పనులు వేగవంతం చేయాలని సూచించారు.

6న రక్తదాన శిబిరం

పాలకొండ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆసుపత్రిలో ఈనెల 6న రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు ఆసుపత్రి సూపరింటెండెంట్ జి.నాగభూషణ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 18 ఏళ్ల దాటి 45 ఏళ్ల లోపు ఉన్నవారు ఈ శిబిరంలో పాల్గొనవచ్చని తెలిపారు.

48 గ్రామాల్లో పీసా ఎన్నికలు

గుమ్మలక్ష్మీపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 48 షెడ్యూల్ గిరిజన గ్రామాల్లో పీసా ఎన్నికలు నిర్వహించినట్టు ఎంపీడీవో సాల్మన్‌రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరో రెండు రోజుల్లో మండలంలోని మొత్తం షెడ్యూల్ గ్రామాల్లో ఎన్నికలు పూర్తి చేస్తామని చెప్పారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎన్నికలు నిర్వహిస్తున్నామన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

బొబ్బిలి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రోత్ సెంటరు సమీపంలో శుక్రవారం సాయంత్రం 125 మద్యం సీసాలను తరలిస్తున్న ఓ వ్యక్తిని పట్టుకుని, అరెస్టు చేసినట్టు ఏఎస్ఐ జి.భాస్కరరావు తెలిపారు. సీఐ కటకం సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు నిఘా పెట్టామన్నారు. గున్నతోటవలస గ్రామానికి చెందిన పప్పల రాధాకృష్ణను మద్యం సీసాలతో పట్టుకున్నామని ఏఎస్ఐ చెప్పారు. పారాది నుంచి తమ గ్రామానికి మద్యం సీసాలను తీసుకెళుతున్నట్టు నిందితుడు తెలిపాడని, ఈ మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.

వీఆర్వోపై అట్రాసిటీ కేసు

బొబ్బిలి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మెట్టవలస వీఆర్వో ఆడపా గౌరీశంకర్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు సీఐ సతీష్‌కుమార్ తెలిపారు. పారాది గ్రామానికి చెందిన నగర పోలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని చెప్పారు. పట్టాదారు పుస్తకాల కోసం అడిగితే వీఆర్వో తనను కులం పేరుతో దూషించాడని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై డీఎస్పీ ఆధ్వర్యంలో దర్యాప్తు నిర్వహిస్తున్నామని సీఐ తెలిపారు.

రాష్ట్ర స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ పోటీలకు చరణ్‌సాయి

కొమరాడ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మన్యం జిల్లా కేంద్రంలో శుక్రవారం జరిగిన జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ పోటీల్లో మార్కొండపుట్టి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన తమ్మిరెడ్డి చరణ్‌సాయి సత్తా చాటాడు. వ్యక్తిగత విభాగంలో మొదటి స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. రూఫ్ వార్మింగ్ ప్రాజెక్టు చేసిన చరణ్‌సాయి న్యాయ నిర్ణేతల మన్ననలు పొందాడు. విద్యార్థితో పాటు గైడ్ టీచర్ పద్మలతను పాఠశాల సిబ్బంది అభినందించారు.

ఉచిత బస్సు ప్రయాణంపై అధ్యయనం

సాలూరు/పార్వతీపురం, జనవరి3 (ఆంధ్రజ్యోతి): ఏపీలో త్వరలో అమలు చేయనున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకంపై రాష్ట్ర మంత్రులతో కలిసి మంత్రి గుమ్మిడి సంధ్యారాణి శుక్రవారం కర్ణాటక రాష్ట్రానికి వెళ్లారు. ఆమెతో పాటు రాష్ట్ర రవాణా శాఖా మంత్రి రాంప్రసాద్, హోం మంత్రి వంగలపూడి అనిత, రాష్ట్ర రవాణా శాఖా ముఖ్య కార్యదర్శి కాంతి లాల్ దండే ఉన్నారు. కర్ణాటక రాష్ట్ర రవాణా శాఖా మంత్రి, అధికారులతో సమావేశమయ్యారు.